


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
17 అక్టోబర్ 2024
పేజీలు: 02




# సీఎం రేవంత్‌పై కేటీఆర్ సెటైర్లు

సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ ఎక్స్‌లో సెటైర్లు వేశారు. '10 నెలల్లో 25 సార్లు హస్తిన పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేశావ్. పైసా పనిలేదు.. రాష్ట్రానికి రూపాయి లాభం లేదు. అన్నదాతల అరిగోసలు, గాల్లో దీపాల్లా గురుకులాలు, కుంటుపడ్డ వైద్యం, గాడితప్పిన విద్యా వ్యవస్థ, ఆడబిడ్డలకు అందని చీరలు, స్కూటీలు, కుట్టు మెషీన్లు లేవు, అవ్వాతాతలకు పెరగని పింఛన్.. అయినా పోయి రావాలె హస్తినకు' అని ఎద్దేవా చేశారు.



# చెన్నైలో భారీ వర్షాలు

చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు(మల్లేశ్వరం), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. బెంగళూరు ఇందిరానగర్ సమీప మెట్రో మార్గంపై ఓ చెట్టు కూలడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



# హైడ్రాకు మరిన్ని పవర్స్

## కమిషనర్ ఏవీ రంగనాథ్

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారం నుంచి అధికారులు హైడ్రా డైరెక్షన్ లోనే నోటీసులు జారీ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 199 విడుదల చేసింది. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. జీహెచ్‌ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్‌ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖ. 374బి ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచనుంది.. ఇక నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసులు జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా చేయనుంది.జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు అధికారాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు బదలాయిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు (జీవో-191) జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ-1955 చట్టంలోని సెక్షన్ 374-బీ ప్రకారం చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లు, డ్రైన్‌ల పరిరక్షించాల్సి ఉంటుంది. ఈ అధికారాలను హైడ్రాకు బదిలీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. మంత్రివర్గ ఆమోదంతో ఆర్డినెన్సు ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపింది. దీనిని ఆమోదిస్తూ ఈ నెల 3వ తేదీన గవర్నర్.. గెజిట్ విడుదల చేశారు. ఈ మేరకు తాజాగా పురపాలక శాఖ జీవో 191ను జారీ చేసింది. ఆర్డినెన్స్, జీవో జారీతో హైడ్రా చర్యలకు సంబంధించి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు చెబుతున్నాయి. తాజా అధికారాలతో ఆక్రమణలకు సంబంధించి హైడ్రా నోటీసులు జారీ చేయనుంది. ఆయా నిర్మాణదారులు సంబంధిత అనుమతి పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించని పక్షంలో స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేస్తుంది. వారు ఇచ్చే వివరణ అప్పటికీ సహేతుకంగా లేకుంటే నిర్మాణం కూల్చివేత/సీజ్ చేసే అధికారం హైడ్రాకు ఉంటుంది. చెరువులు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలపై ఆదిలో ఉక్కుపాదం మోపిన హైడ్రా... హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొంత కాలంగా ఆచితూచి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడంతోపాటు చెరువుల వాస్తవ విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై దృష్టి సారించింది. ఇందుకోసం సర్వే ఆఫ్ ఇండియా, ఎన్‌ఆర్‌ఎస్‌సీ సాంకేతిక సహకారం తీసుకుంటోంది. కూల్చివేతలకు న్యాయపరమైన ఇబ్బందులు తొలగినట్లే జీవో జారీ నేపథ్యంలో ఇక నుంచి చట్టపరంగా ముందుకు వెళ్లాలని సంస్థ భావిస్తోంది. వాస్తవానికి రోడ్లు, పార్కులు, చెరువుల్లో ఆక్రమణలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసే అధికారాలు జీహెచ్‌ఎంసీతోపాటు మునిసిపాలిటీలకు ఉన్నాయి. కానీ, కూల్చివేతలపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో నోటీసుల జారీ, స్పీకింగ్ ఆర్డర్స్ తర్వాతే హైడ్రా నిర్ణయం తీసుకోనుంది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు హైడ్రా పరిధి ఉన్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వరకు జీహెచ్‌ఎంసీ యాక్ట్ ప్రకారం, ఆవలి ప్రాంతాల్లోని 27 మునిసిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో మునిసిపల్ చట్టం ప్రకారం ముందుకు సాగనున్నట్టు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. తాజా జీవోతో హైడ్రా మరింత బలపడిందని, పూర్తి స్థాయిలో అధికారాలు వచ్చాయ న్నారు. అనధికార భవనాలను కూల్చివేయడంతోపాటు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారికీ హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని తెలిపారు.



# తెలంగాణ పత్తి రైతులపై ఎందుకీ వివక్ష?: హరీశ్ రావు

గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు ₹8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణ పత్తికి ₹7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర రైతులపై ఎందుకీ వివక్ష అని ప్రశ్నించారు. 'వన్ నేషన్-వన్ ట్యాక్స్, వన్ ఎలక్షన్, వన్ రేషన్ కార్డ్, వన్ మార్కెట్ అని ఊదరగొట్టే కేంద్రం వన్ నేషన్- వన్ ఎంఎస్‌పీ వ్వట్లేదు. ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఎందుకుంది?' అని ఎక్స్‌లో నిలదీశారు.



హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడులు..

# 30 చోట్ల తనిఖీలు

హైదరాబాద్‌లో ఐటీ దాడులు మరోసారి కలకలం రేపుతున్నాయి. తాజాగా నగరంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. ఏకకాలంలో 30 చోట్ల ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఐటీ సోదాలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. అన్విత బిల్డర్స్, ప్రాపర్టీస్ కార్యాలయాలు, మేనేజ్మెంట్ల ఇళ్లల్లో ఏకకాలంలో కొనసాగుతున్నాయి. చైతన్యపురి లోని గూగీ ప్రాపర్టీస్ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. మలక్ పేట నియోజకవర్గానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన షేక్ అక్బర్ ఇంటిలో సోదాలు చేస్తున్నారు. షేక్ అక్బర్ కు చెందిన గూగి ప్రాపర్టీస్ కార్యాలయాల్లో ఐటీ సోదాలు చేపట్టారు. అన్విత బిల్డర్స్ అధినేత బొప్పరాజు శ్రీనివాసు అచ్యుతరావు ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. విజయవాడకు చెందిన రియల్టర్ల పై ఐటీ సోదాలు చేస్తున్నారు.




# అప్రమత్తంగా ఉండండి.. సీఎం చంద్రబాబు ఆదేశం

రాష్ట్రంలో వాయుగుండం ప్రభావం, భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సాగు నీటి ప్రాజెక్టులు, చెరువులు, వాగుల్లో వరద ప్రవాహాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో పలు చోట్ల భారీ వర్షాలు పడినట్లు సంబంధిత కలెక్టర్లు సీఎంకు వివరించారు.



# బీహార్‌లో కల్తీమద్యం తాగి 25కి చేరిన మృతుల సంఖ్య!

మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్ రాష్ట్రంలో మరోసారి కల్తీ మద్యం కలకలం సృష్టిస్తోంది. బిహార్‌లోని సివాన్, సారణ్ జిల్లాల్లో కల్తీ మద్యం సేవించి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. సివాన్ జిల్లాలోనే ఏకంగా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు సివాన్ ఎస్పీ అమితేష్ కుమార్ తెలిపారు. మరో 10-15 మందికి పాట్నాలోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. సారణ్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు చాప్రా పట్టణం ఎస్పీ కుమార్ ఆషిశ్ తెలిపారు. సివాన్, సారణ్ జిల్లాల్లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే.. చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు.




50 రోజుల్లో రానున్న

# పుష్ప 2

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2' కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డులు బద్దలవడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్రియేటివ్ జీనియస్ సుకుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ క్రేజీ సీక్వెల్ మూవీ డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. అయితే, ఈ సినిమా రిలీజ్‌కు ఇంకా 50 రోజులు మిగిలి ఉన్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ఇదే విషయాన్ని తాజాగా ఓ కొత్త పోస్టర్ ద్వారా తెలియజేశారు. పుష్ప రాజ్ సీరియస్ మోడ్‌లో కూర్చున్న పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బ్యాక్‌గ్రౌండ్‌లో పుష్పరాజ్ బ్రాండ్ మార్క్ అయిన చేతి గుర్తు మనకు కనిపిస్తుంది. ఇలా ఈ సరికొత్త పోస్టర్ ప్రేక్షకులను, అభిమానులను ఆకట్టుకోవడంతో, ఈ సినిమాపై అంచనాలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఇక ఈ సినిమాలో తన నటనతో అల్లు అర్జున్ మరోసారి బాక్సాఫీస్ ఊచకోతకు సిద్ధమవుతున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. మరి 50 రోజుల్లో రానున్న ఈ 'పుష్ప-2' తుఫాను ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో చూడాలి.




# వివిపీలకు ఎన్‌ఎస్‌జీ భద్రత కట్

దేశంలోని వీఐపీలకు ఎన్‌ఎస్‌జీ భద్రతను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై వీరి భద్రతను సీఆర్‌పీఎఫ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. జెడ్ ప్లస్ కేటగిరిలో చంద్రబాబు, యోగి ఆదిత్యనాథ్, అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్, మాయావతి, సర్బానంద సోనోవాల్, అజాద్, ఫరూక్ అబ్దుల్లాకు భద్రత ఉపసంహరించనున్నారు. వీరి సెక్యూరిటీని సీఆర్‌పీఎఫ్ చూసుకుంటుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## నో బ్రేక్ అంటోన్న ఎన్టీఆర్..?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటించిన లేటెస్ట్ మూవీ 'దేవర' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను దర్శకుడు కొరటాల శివ డైరెక్ట్ చేయగా, పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమా తరువాత కాస్త బ్రేక్ తీసుకుంటున్న ఎన్టీఆర్, తన నెక్స్ట్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నాడు. ఇప్పటికే బాలీవుడ్ ప్రెస్టీజియస్ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్-2'లో తారక్ నటిస్తున్న సంగతి తెలిసిందే. దీని తరువాత ఆయన ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేయనున్నాడు. ఇక నవంబర్ నుండి ఎన్టీఆర్ 'వార్-2' షూటింగ్‌లో జాయిన్ అవుతున్నాడు. తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకుని నీల్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతున్నాడు. అటు ప్రశాంత్ నీల్ కూడా ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్‌లో స్టార్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడట. ఎన్టీఆర్ లేని సీన్స్‌కి సంబంధించిన షూట్ జరపుకునేందుకు ఆయన రెడీ అవుతున్నాడు. ఆ తరువాత తారక్ కూడా మూవీ షూటింగ్‌లో జాయిన్ కానుండటంతో, ఎలాంటి బ్రేక్ లేకుండా తారక్ తన నెక్స్ట్ రెండు సినిమాలను పూర్తి చేయాలని చూస్తున్నాడట.

# మెటా ఉద్యోగులకు షాక్



టెక్ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో మొదలైన లేఆఫ్స్ సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతోంది. తొలుత మాంద్యం భయాలతో ఉద్యోగులను ఎడాపెడా పీకేసిన సంస్థలు.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. విడతల వారీగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. తాజాగా ఫేస్‌బుక్ మాతృసంస్థ అయిన మెటా మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, రియాలిటీ ల్యాబ్స్ కోసం పనిచేస్తున్న టీమ్‌లతో సహా మెటా వర్స్ అంతటా లే ఆఫ్స్‌ను ప్రకటించింది. అయితే, ఎంత మంది ఉద్యోగులను తొలగిస్తుందనే సమాచారాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. రిక్రూటింగ్, లీగల్ ఆపరేషన్.. వంటి వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనున్నట్లు తెలుస్తోంది. కాగా, మెటా ఇప్పటికే పలుసార్లు ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2022లో ఏకంగా 11 వేల మందిపై వేటు వేసింది. ఇక గతేడాది రెండు విడతల్లో సుమారు 10 వేల మందిని ఇంటికి సాగనంపింది. ఇప్పుడు తాజాగా మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధం కావడం టెక్ ఉద్యోగులను కలవరానికి గురి చేస్తోంది. లేఆఫ్స్ గురించి ఇప్పటికే సదరు ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో భాగంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



## అయిదుగురు డకౌట్.. 46కే ఇండియా ఆలౌట్

రోహిత్ సేన ఏం ప్లాన్ చేసిందో తెలియదు. కానీ బెంగుళూరు టెస్టు(Ind Vs Nz) ఫస్ట్ ఇన్నింగ్స్‌లో.. ఇండియన్ బ్యాటింగ్ లైనప్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. న్యూజిలాండ్ బౌలర్ల దూకుడు ముందు.. భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి రోజు వర్షం వల్ల ఆట రద్దు కాగా, ఇవాళ రెండో రోజు ఉదయం టాస్ గెలిచిన ఇండియా ఫస్ట్ బ్యాటింగ్ తీసుకున్నది. కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. ఇండియన్ బ్యాటర్లు త్వరత్వరగా పెవిలియన్ చేరుకున్నారు. కేవలం 46 పరుగులకే ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ 5 వికెట్లు తీసుకోగా, రౌర్కీ 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇండియన్ ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ అత్యధికంగా 20 పరుగులు చేయగా, అయిదుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. కోహ్లీ, సర్ఫరాజ్, జడేజా, కేఎల్ రాహుల్, అశ్విన్.. ఖాతా తెరవకుండానే పెవిలియన్ బాట పట్టారు. స్వంత గడ్డపై భారత్ జట్టు ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో అతి తక్కువ పరుగులకు ఔట్ కావడం గమనార్హం. టెస్టుల్లో అతి తక్కువ పరుగులకు ఇండియా నిష్క్రమించడం ఇది మూడవసారి.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 8 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 75,371 మంది భక్తులు దర్శించుకోగా 24,065 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.21 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ ఇలంబరితి

జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా ఐఏఎస్ ఇలంబరితి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబరితికి జీహెచ్ఎంసీ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నిన్నటి వరకు బాధ్యతలు నిర్వర్తించిన ఆమ్రపాలి.. ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ కావడంతో ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పని చేస్తున్న ఇలంబరితికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. డీవోపీటీ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేసిన ఆమ్రపాలి ఏపీలో రిపోర్టు చేశారు.




## వికారబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం.. ముగ్గురు దుర్మరణం

వికారాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పూడూరు గేట్ వద్ద ఆర్టీసీ బస్సు – బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు యువకులు, ఓ బాలుడు కలిసి బైక్‌పై పూడూరు నుంచి మేడికొండ వైపు వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల్లో ఇద్దరు మేడికొండ, ఒకరు గొంగుపల్లి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బజాజ్ ఆటో రివర్స్‌గేర్.. చేతక్ అమ్మకాలు




బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 1,385 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, డిఫర్డ్ ట్యాక్స్‌కు పెరిగిన కేటాయింపులు ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ.10,838 కోట్ల నుంచి రూ. 13,247 కోట్లకు జంప్ చేసింది. మొత్తం వ్యయాలు రూ. 8,806 కోట్ల నుంచి రూ. 10,767 కోట్లకు పెరిగాయి. ఈ క్యూ2లో బజాజ్ ఆటో స్టాండెలోన్ నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 2,005 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 10,777 కోట్ల నుంచి రూ. 13,127 కోట్లకు బలపడింది. ఈ కాలంలో వాహన విక్రయాలు 16 శాతం ఎగసి 12,21,504 యూనిట్లకు చేరాయి. దేశీ అమ్మకాలు 26 శాతం జంప్‌చేసి 6,36,801 యూనిట్లను తాకగా.. ఎగుమతులు 5 శాతం పుంజుకుని 3,96,407 యూనిట్లుగా నమోదయ్యాయి. కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్ 70,000 యూనిట్ల అమ్మకాలు సాధించింది.



## సిద్ధిపేట కుంకుమ పువ్వు వచ్చేస్తోంది!

సిద్ధిపేట కుంకుమ పువ్వు.. ఇకపై ఈ బ్రాండ్ మార్కెట్‌లో లభించనుంది. కశ్మీర్ లాంటి చల్లని వాతావరణంలో సాగయ్యే ఈ పంటను DXN కంపెనీ ఏరోఫోనిక్స్ టెక్నాలజీతో సాగు చేసి ఔరా అనిపించింది. సిద్దిపేట అర్బన్(M) మందపల్లిలో ఈ కంపెనీ ఉంది. ఇక్కడ కుంకుమ పువ్వు సాగవడానికి అవసరమయ్యే పరిస్థితుల్ని ఓ గదిలో ఏర్పాటు చేశారు. 40 వేల మొక్కలతో ఎకరా స్థలంలో రావాల్సిన 600 గ్రాముల పువ్వు గది విస్తీర్ణంలోనే సాగు అయ్యింది.

## హాట్ లుక్స్ లో మాళవిక

దాపుగా పదేళ్ల క్రితం మలయాళంలో 'పట్టం పోలే' సినిమాతో హీరోయిన్ అయ్యింది మాళవిక మోహనన్. ఆ తర్వాత తమిళంలో రజనీకాంత్‌తో 'పేట', విజయ్‌తో 'మాస్టర్'. ధనుష్‌తో 'మారన్' సినిమాల్లో నటించింది. హిందీలో కూడా ఓ సినిమా చేసింది. కానీ.. తెలుగులో మాత్రం సినిమా చేయలేదు. తాజాగా ప్రభాస్ 'రాజాసాబ్'తో తెలుగులో ఛాన్స్ కొట్టేసింది. ఇటీవల చెన్నయ్‌లో జరిగిన ఓ ప్రైవేటు ఈవెంట్‌లో తన తాజా తెలుగు సినిమా గురించి మాట్లాడింది మాళవిక 'నేను సౌత్‌లో అన్ని భాషల్లో చేశాను.. తెలుగులో తప్ప. మంచి పాత్ర దొరికితే తెలుగులో కూడా చేయాలనే కోరిక బలంగా ఉండేది. ప్రభాస్ నుంచి ఇలాంటి కథను ఎవరూ ఊహించరు. లొకేషన్‌లో ఆయన కొత్తగా కనిపిస్తున్నారు. మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించిన దర్శకుడు మారుతిగారికి థ్యాంక్స్' అని తెలిపింది మాళవిక మోహనన్.



## మద్యంపై ఆ పన్నులు తొలగింపు

మద్యంపై ఉన్న పలు రకాల పన్నులు, మార్జిన్‌లను కూటమి సర్కార్ తొలగించింది. గత ప్రభుత్వంలో ఉన్న 4శాతం రిటైల్ ఎక్సైజ్ పన్ను, ఏపీఎస్‌బీసీఎస్ రిటైల్ మార్జిన్(6శాతం), ల్యాండెడ్ కాస్ట్‌పై 10 శాతం అదనపు ఎక్సైజ్ సుంకాలకు స్వస్తి పలికింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మొత్తంగా 10 రకాల పన్నులు ఉండగా అవి 6కి తగ్గాయి.





## ఆలస్యంగా నిద్ర లేస్తున్నారా?

త్వరగా నిద్ర లేచే వారి కంటే ఆలస్యంగా మేల్కొనే వారిలోనే తెలివితేటలు, జ్ఞాపకశక్తి, ఐక్యూ ఎక్కువగా ఉన్నట్లు లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. 26 వేల మంది అమ్మాయిలపై వారు స్టడీ చేశారు. త్వరగా నిద్ర నుంచి మేల్కొనే వారి కంటే ఆలస్యంగా మేల్కొన్న వారే పనులు సమర్థవంతంగా చేయగలుగుతున్నారని వెల్లడించింది. త్వరగా లేవాలనే ఉద్దేశంతో చాలీచాలని నిద్రపోవడం మంచిది కాదని పేర్కొంది.